


# అనుకరణాలతో అనర్థం

**పాలడుగు పరబ్రహ్మమ్**

**శివరామ్‌కు** హైదరాబాద్ ట్రాన్స్‌ఫర్ అయిందని తెలియగానే పుష్పవల్లి హృదయం ఆనందంతో పరవశించింది. ఇన్నాళ్ళూ చిన్న చిన్న పట్టణాలలో ఉండి ఉండి విసిగిపోయిన ఆమె మనస్సు నగరవాసం కోసం తహతహలాడి పోతూంది.

ఆర్డర్స్ అందిన వెంటనే అత్యంతోత్సాహంతో ఇంటి సామానులన్నీ పాక్‌చేసుకొని కుటుంబంతో సహా పట్నం చేరుకున్నాడు శివరామ్. అంతకుముందే అతని మిత్రుడు పెద్ద ఇల్లు ఒకటి అద్దెకు కుదిర్చి సిద్ధంగా ఉంచడంతో వారికి రాగానే ఇంటి సమస్య లేకుండా పోయింది. పుష్పవల్లి సంతోషంగా ఇల్లంతా చక్కదిద్దింది. సామానులన్నీ ఎక్కడివక్కడ సర్ది అందంగా అలంకరించడానికే వారం రోజులు గిర్రున తిరిగిపోయాయి. పుష్పవల్లికి అన్ని పనులు ఒక్కసారి చేసే అలవాటు లేకపోవడంతో ఒళ్ళంతా భారంగా, పచ్చి పుండులాగా తయారయింది. రోజూ రాత్రిళ్ళు పడుకునే సమయానికి ఒళ్ళు నొప్పులు, పొద్దున్నే లేవటాయె ముందు బద్ధకం మామూలు అయాయి.

అన్నీ అమరికగా ఉన్నా, సరి అయిన పనిమనిషి దొరకలేదు. ఎవరెవరికో చెప్పి చూసింది పుష్పవల్లి. కాని, ఫలితం శూన్యం. మరో నాలుగు రోజులు గడిచాక ఒక రోజు మధ్యాహ్నం ఒక పిల్ల పని కోసం వెతుక్కుంటూ వాళ్ళ ఇంటికి వచ్చింది.

"పనిమనిషి కావాల్నామ్మా?" అన్న మాటలు వినిపించగానే బయటికి వచ్చి చూసింది పుష్పవల్లి. సన్నగా—పీలగా ఉన్న ఆ పిల్లను పరీక్షగా చూసింది, మొహమంతా పీక్కుపోయి, కళ్ళు లోతుకుపోయి.




ఒట్టి ఎముకల గూడులా ఉన్న ఆ పిల్లకు పని ఏం చేతనవుతుంది అనిపించిం దామెకు.

"ఏమమ్మ, మల్ల చెయ్యాల్నా పని?" అని ఆత్రతగా అడిగింది ఆ పిల్ల.

"నువ్వు చేస్తావా! నీకు ఎన్నేళ్ళు?" పుష్పవల్లి అనుమానంగా అడిగింది.

"పన్నెండు."

"మీ ఇల్లెక్కడుంది?"

"గీణ్ణే...అ కానొచ్చే గడ్డమీద."

"జీతం ఎంత కావాలి?"

"మీ రెంతిస్తే అంత తీస్కుంట."

"ఏమేం పని చేయగలవు?"

ఆ పిల్ల పెద్ద ఆరిందాలా చేతులు తిప్పుతూ, "పని దేమున్నదమ్మ! ఏ పని జెప్తె ఆ పని జేస్త. ముందుగాలనే అట్లంత మాటాడుకునే అలవాటే లేదు నాకు. ఇల్లంత నాదే అనుకుని అన్ని పనులు జేస్త... సమయం పడ్డప్పుడు వంట కూడా జేస్త" అంది.

"నీ పేరేమిటి?" అడిగింది పుష్పవల్లి.

"పార్వతి."

"ఇదిగో చూడు, పార్వతీ రేపు మీ అమ్మను తీసుకురా అన్నీ మాట్లాడతాను."

పుష్పవల్లి మాట ఇంకా పూర్తి కాక ముందే పార్వతి అందుకొని—"మా అమ్మ ఎందుకమ్మ...నేను జెప్తున్న గద? నువ్వు జెప్పిన పనంత జేస్త. జీతం నువ్విచ్చినంత తీస్కుంట." అంది.

పార్వతి మాటలు విసియంగానే ఉన్నా, పుష్ప వల్లికి ఆ ఏకవచన ప్రయోగం చూసి ఒళ్ళంతా గగుర్పొడిచింది. మనస్సుకు ఆదోలా అనిపించింది.

"నువ్వు మా ఇంట్లో పని చెయ్యాలి అంటే ముందు 'నువ్వు' అనడం మానేయాలి. తెలిసిందా! 'మీరు' అని మర్యాదగా మాట్లాడ్డం నేర్చుకో. ఆ తరవాత పని సంగతి" అంది పుష్పవల్లి.

"ఏం జెయ్యాల్నమ్మ... మాకు గట్లనే అల్వాటు" అంది పార్వతీ ఇబ్బందిగా.

"ఏమో? నా కదంతా తెలియదు. నువ్వు అలా మాట్లాడ్డం నేర్చుకుంటేనే పనిలో పెట్టు కుంటా. లేకపోతే లేదు." అంది పుష్పవల్లి ఖచ్చితంగా.

"పోనీలే. నేర్చుకుంట గాని, నన్ను కొలువుల మాతరం ఉంచుకో. అంతే" అంది పార్వతి రాజీకి వచ్చినట్టు.

"అదిగో మళ్ళీ అలాగే అంటున్నావు" అనేసి కాసేపు తనే ఆలోచించింది పుష్పవల్లి. 'గుమ్మంలోకి వచ్చిన పనిమనిషిని వదులు కోవడ మెందుకు? అన్ని పనులూ చేస్తానంటూంది కదా? అది చూద్దాం' అనుకొని, "అలాగైతే రేపటి నుంచి పనిలోకి రా" అంది.

"రేపటి నుంచి ఎందుకమ్మ! ఇయ్యాల్నేజేర్త" అంటూ ఆమె జవాబుకు కూడా ఎదురు చూడ కుండా లోపలికి నడిచింది పార్వతి. ఇల్లంతా ఒకసారి కలియ తిరిగి చూసింది. ఆ తరవాత అక్కడక్కడ పడి ఉన్న వస్తువులన్నీ తీసి ఏవి ఎక్కడ పెట్టాలో అడిగి తెలుసుకొని అవన్నీ అక్కడ పెట్టి, ఉతికి ఆరేసిన బట్టలన్నీ తీసి చక్కగా మడత పెట్టింది. కాఫీ తాగి పెట్టిన

గ్లాసులన్నీ తీసుకువెళ్ళి శుభ్రంగా తోమి వంటింట్లో బోర్లించింది.

పనిలో ఆ అమ్మాయి చురుకుదనం చూసి పుష్పవల్లి ఆశ్చర్యపడింది. ఆమె చూస్తూ ఉండగానే ఇల్లంతా నిమిషాల మీద నీట్‌గా తయారుచేసింది పార్వతి.

సాయంకాలం మవుతూండగా పిల్లలిద్దర్నీ మెల్లగా దగ్గరికి తీసి వాళ్ళకు కబుర్లు చెప్పి, నవ్విస్తూ ముస్తాబు చేసింది. హరిబాబుకు మూడేళ్ళు. పానీకి ఎనిమిది నెలలు. హరిబాబుకు ఆమె మాటలు ఒక్కటి కూడా అర్థం కాకపోయినా అదీ ఒకతమాషాగా అనిపించి ఆమె చెప్పినట్టల్లా విన్నాడు.

"అమ్మా! ఊళ్ళను చమన్లకు తోల్కపోవాల్నా?" అని అడిగింది పార్వతి.

పుష్పవల్లికి అర్థం కాలేదు. "అంటే?" అంది తెల్లబోతూ.

పార్వతి వీధి చివర ఉన్న పార్కు కేసి చూపిస్తూ—"అగో, గాడికి తీస్కపోవాల్నా అని అడుగుతున్న" అంది.

"చంపావ్ పో! పార్కుకు తీసుకువెళతానంటున్నావా?" అంటూ విరగబడి నవ్వింది పుష్పవల్లి. పిల్లల్ని సరిగా చూసుకోగలదా అని అనుమానం వచ్చి "వద్దు" అంది.

కాని, పార్వతి "ఏంటేగా?" "ఇయ్యాల్లొక్క రోజు చూస్తే నీకే తెలుస్తది కద? అంత గుబులెందుకమ్మా?" అంటూ పుష్పవల్లి మాట కోసమైనా ఎదురు చూడకుండా పానీని చంకను వేసుకొని, హరిబాబు చెయ్యి పట్టుకుని బయటికి వెళ్ళిపోయింది. పుష్పవల్లి ఆశ్చర్యంతో అలా చూస్తూ ఉండిపోయింది.

రెండవరోజు తెలవారే సరికల్లా గుమ్మం ముందు ప్రత్యక్షమయింది పార్వతి. పుష్పవల్లి నిద్రలేచి తలుపు తెరవగానే లోపలికి వస్తూ, "చీకట్లనే వచ్చిన అమ్మ... మీ రెవ్వరు లేవలేదని గడపలనే కూసున్న" అంది.

ముందు వాకిలి వూడ్చి, కళ్ళాపి చల్లి ముగ్గు వేసింది. ఆ తరవాత అంట్లు తోమి, పక్కలు తీసి ఇల్లు వూడ్చి, బాత్‌రూములో అన్నింటిలోనూ నీళ్ళు నింపింది. పుష్పవల్లికి వంటలో చాలావరకు సాయం చేసింది. మసాలా నూరి ఇవ్వడం కూరలు తరగడం, బియ్యం గాలించడం, పచ్చడి రుబ్బడం అన్నీ అర గంటలో చేసింది. పనిలో అంతటి నేర్పరితనం చూసి పుష్పవల్లి ముగ్ధురాలయింది. ఆ రోజు ఆమెకు వంట పని ఎంతో తేలికగా అయినట్లనిపించింది.

నాలుగురోజులు గడవక ముందే పార్వతి ఇంట్లో అందరికీ కావలసిన పనిమనిషి అయింది. ఎన్నో వస్తువులను తనకు అనుకూలంగా ఉండేటట్టు మార్చుకుంది. పిల్లలకు తన ఇష్టం వచ్చినట్టు టాయిలెట్ చేసింది. అయినా, పుష్పవల్లి ఏమీ అన లేదు. చిన్నపిల్ల—దాని ఇష్టాన్ని ఎందుకు కాదనడం? అని అన్నిటికి వూరుకుంది.

మధ్యాహ్నం భోజనం, పనీ ముగించుకొని కాస్సేపు నడుము వాల్చేది పుష్పవల్లి. అప్పుడు పార్వతి కేమీ తోచేది కాదు. "నా కేదయినా పని చెప్పమ్మా" అని వేధించేది. 'పాపం! చిన్నపిల్లతో ఇన్ని పనులు చేయిస్తున్నానే' అని అసలే బాధపడుతున్న పుష్పవల్లి ఆమె కప్పుడు ఏ పనీ చెప్పక-"చిన్నపిల్లవి, ఎంతసేపని పని చేస్తావ్? వెళ్ళి కాసేపు ఎక్కడైనా ఆడుకొని రా" అనేది. కాని, పార్వతి తల అడ్డంగా వూపి, "నేను పోను. నాకట్ల ఆడుకో బుద్ధి కాదు... ఏమన్న పని చేస్కుంట ఇంట్లనే కూసుంటే మంచిగనిపిస్తది" అని ఏదో ఒక పని వెతుక్కొని చేస్తూ ఉండేది. బియ్యమో, పప్పో—ఏదో ఒకటి తీసుకుని రాళ్ళేరుతూ కూర్చుండేది. లేకపోతే ఏదో ఒక గది కడగడమో, బూజు దులపడమో చేసేది కాని, బయటికి మాత్రం వెళ్ళేది కాదు.

వయసుకు మించిన ఆమె మాటలూ, చేతలూ పుష్పవల్లికి ఆశ్చర్యాన్ని కలిగిస్తూ ఉండేవి. మరో ఇరవై రోజులు గడిచే సరికి పార్వతి లేకుండా ఒక్క రోజు జరగదు అనుకునే పరిస్థితి ఏర్పడింది. ఇంట్లో వంట ఒక్కటే తప్ప మిగతా పనులన్నీ పార్వతే చేసేది. ఇంటికి ఎవరైనా అతిథులు వస్తున్నారని తెలిసినప్పుడు పుష్పవల్లి కన్నా పార్వతే ఎక్కువ హడావిడి చేసేది. గుమ్మాలకూ, కిటికీలకూ ఉన్న కర్టెన్లూ, టేబుల్ క్లాత్‌లూ మార్చేది. బల్లలు, కుర్చీలు శుభ్రంగా తుడిచి ఇల్లంతా అద్దంలా తయారు చేసేది. వచ్చిన ప్రతివారూ ఆమెను మెచ్చుకోవడమే.

మరికొన్ని రోజులు గడిచేసరికి పార్వతికి ఇంట్లో బాగా చనువు పెరిగింది. ఆమె భాషలో కూడా మార్పు వచ్చింది. అందర్నీ ఏకవచనంతోనే సంబోధించడం మానేసి, బహువచనంతో సంబోధించడం నేర్చుకుంది.

ఒకసారి పుష్పవల్లి మంచి మూడ్‌లో ఉన్నప్పుడు మెల్లగా దగ్గరికి చేరి—"అమ్మగారూ



వార్తలకు, వ్యాఖ్యలకు స్వతంత్ర భావ ప్రకటనకు
అందరూ అభిమానించే దినపత్రిక
ఆంధ్రప్రభ

చేసుకొని మరీ పెట్టుబడి పెట్టండి.



మీరు శాన్క్యోనే ఎంచుకోవాలనుటకు గల
9 మంచి కారణాలు.

Sankyo



★ ఉజ్వల కాంతి—పెడల్ మీద అడుగు పెట్టీ పెట్టగానే యిట్టే వెలిగిపోతుంది.
★ దీర్ఘకాల మన్నిక—జీవితాంతం ...న్నుతుంది.
... ఖర్చు కల్సి వస్తుంది—బ్యాటరీకి, ...గోగులకు లేదా ఫ్యూయల్‌కు ఖర్చే వుండదు.
★ ఏటికి ఏడాది వెలుగుతుం... ...న్ని కాలాల్లోను మంచి కాంతివంతంగా వుంటుంది.
★ అధునాతన సాంకేతిక పరిజ్ఞానం—జపాన్‌వారి చేయూతతో అత్యంత అధునాతనమైన ప్లాంట్‌లో తయారు చేస్తారు.
★ నాణ్యత గారంటీ—నాణ్యత ఖచ్చితంగా వుండాలని అంచలవారీగా పరీక్ష చేస్తారు.
★ అంతర్జాతీయ ఆమోదం పొంది—ప్రపంచమంతటా ఎగుమతి చేస్తున్నారు.
★ అందరి అభిరుచికి తగ్గ మోడల్స్—12 ఓల్టులు అండ్ 6 ఓల్టులు రెండు బల్బులు లేదా ఒకే బల్బుండి రకరకాల డిజైన్లున్నాయి
★ మార్కెటింగ్—భారత దేశమంతటా రెడీగా దొరుకుతున్నాయి.

భారత దేశంలో అత్యధికంగా అమ్ముడవుతున్న
12 ఓల్టుల శాన్క్యో డైనమో లైట్
ఉత్పత్తి చేయువారు :
IJI ఇండో-జపనీస్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, కలకత్తా
మార్కెట్ చేయువారు : నిగమ్ బ్రదర్స్. కలకత్తా-700 013
మా బ్రాంచీలు : బొంబాయి, ఢిల్లీ, మద్రాసు, కాన్పూర్, మరియు విజయవాడ
Orient

నా కొక సీ రియ్యండమ్మ గారూ... పాతది... చినిగి పోయిందయినా ఫర్వలే... ఎన్నో దినాల్నుంచి నాకు సీరకట్టుకోవాల్నని ఇష్టం గాని." అని ఆపింది బెరుకుగా.

"కానీ?" పుష్పవల్లి కుతూహలంగా చూసింది.

"కాని, మా అమ్మ నాకు సీరలు కొనియ్యదు. మా అక్కలిద్దరికీ పెండ్లయిందాక నేను లంగలే తొడుక్కోవాల్నంట" అంది ఎంతో నిరాశగా.

పుష్పవల్లికి ఆమెను చూస్తూంటే జాలివేసింది. వెంటనే బీరువా తెరిచి మంచి చీరె ఒకటి తీసి ఇచ్చింది పార్వతికి. పార్వతి మొహం చేటంత అయింది.

మరునాడు ఉదయం పనికి వచ్చినప్పుడు పార్వతి ఆ చీరె కట్టుకుని వచ్చింది. అంతేకాదు, జుట్టు పుష్పవల్లి లాగే చెవుల మీదుగా దువ్వి జడ వేసుకుని, ఆమెలాగే బొట్టు పెట్టుకొని మరీ వచ్చింది. ఆ రోజు ఆమెలో ఉత్సాహం పొంగి పొర్లుతూ ఉన్నట్టు ఆమె మొహం చూస్తేనే తెలిసిపోయింది పుష్పవల్లికి. పార్వతి తనలాగే కొంగూ, కుచ్చెళ్ళూ దోపుకుని పనిలోకి దిగడం చూసి నవ్వుకూడా వచ్చింది.

శివరావ్ నిద్ర లేవగానే పార్వతిని చూసి ఆశ్చర్యపోయి — "అయ్యో నువ్వా! నేవింకా పెద్దవాళ్ళు వచ్చారనుకుంటున్నా" అంటూ నవ్వాడు.

ఆ మాట విని పార్వతి ఎంతగానో సిగ్గుపడి పోయింది. మొహాన్ని రెండు చేతులతోనూ కప్పుకొని వేళ్ళ సందుల్లోంచి శివరావ్‌వైపు చూస్తూ అక్కడి నుంచి వెళ్ళిపోయింది. ఆమె సిగ్గు చూసి భార్యా భర్త లిద్దరూ నవ్వుకున్నారు.

పిల్ల లిద్దరూ పార్వతికి బాగా అలవాటయి పోయారు. పుష్పవల్లికికూడా ఆమె లేకుండా క్షణం గడవదు. శివరావ్ అప్పుడప్పుడు పార్వతిని వేళాకోళం చేస్తూ, ఆమె చేసిన పనులను మెచ్చుకుంటుంటే పార్వతి హృదయం ఆనందంతో గంతులు వేసేది. ఎంత పనైనా విసుక్కోకుండా నవ్వు మొహంతో చేసే పార్వతి పట్ల పుష్పవల్లికి అపేక్ష ఎక్కువ అయి, పార్వతికి రోల్డుగోల్డు దుద్దులు, రిబ్బన్లు, గాజులు అన్నీ కొని పెట్టింది.

నానాటికి ఇంట్లో చనువు, స్వతంత్రం ఎక్కువ అయి, తనే కూరగాయలు బేరం చేసి తీసుకోవడం, తన కెంత తోస్తే అంత పాలు పోయించుకోవడం, పుష్పవల్లిని అడగకుండానే వంట ఏం చేయాలో తనే నిర్ణయించి కూరలు తరిగి పెట్టడం మొదలు పెట్టింది పార్వతి. పుష్పవల్లికి ఇవన్నీ చూసి కోపం వచ్చినా, 'పోనీలే, మన కోసమే కదా చేస్తూంది' అని సర్దుకుని పైకి ఏమీ అనకుండా వూరుకుంటూంది.

అలా అన్నిటిని సర్దుకో గలిగిన పుష్పవల్లి ఒక విషయంలో మాత్రం సర్దుకుని వూరుకోలేకపోయింది. అది-పార్వతి కాస్త తీరిక దొరికినప్పుడెల్లా పడక గదిలోకి వెళ్ళి అద్దం ముందు నిలబడి పోవడం. అలా అద్దం ముందు నిలబడి తన అందాన్ని చూసు కుంటూంటే ఆమెకు సమయం మీద ధ్యాసే ఉండేది కాదు. గంటలకు గంటలే నిలబడి పోయేది. పుష్పవల్లి ఏదైనా పనిమీద పిలిస్తే అప్పుడు ఉలికి పడి

ఇవతలికి వచ్చేది. అస్తమానం పైట సర్దుకోవడం. శివరావ్ ఎదుట అనవసరంగా సిగ్గు పడడం-ఇవన్నీ పార్వతి కొత్తగా నేర్చుకున్న విద్యలు.

పగలల్లా అక్కడే ఉండి, రాత్రిళ్ళు పడుకోవడానికి మాత్రం ఇంటికి వెళ్ళే పార్వతి కొన్నాళ్ళకు అక్కడే పడుకుంటానని పుష్పవల్లిని వేధించడం ప్రారంభించింది. దానికి పుష్పవల్లి ఒప్పుకోక "పొద్దుటి నుంచి ఇక్కడే ఉంటున్నావుగా? ఇంకా రాత్రిళ్ళు కూడా ఎందుకు? అయినా. ఆడపిల్లలు పరాయి చోట పడుకోవడం మంచిది కాదు, పార్వతీ" అని నచ్చ చెప్పింది ఒక రోజు.

పార్వతి మొహం చిన్నబోయింది. "పిల్లలు నాకు బాగా అలవాటయిండ్రమ్మా. రాత్రి పూట ఇంటికాడ పడుకుంటే వూకే గుర్తు కొస్తరు. అండ్ల మాది చిన్న ఇల్లు. ఉన్నదేమో పది మందిమి. పండుకోవటానికి జాగే ఉండదు. అందుకనే అంటున్న. ఈడ్నే వరండాల పడుకుంట" అంది, ఏడుపు గొంతుతో. అప్పటికే పార్వతి కళ్ళల్లో నీళ్ళు తిరగడం చూసిన శివరావ్ కరిగిపోయాడు.

"పోనీ, పడుకోనివ్వు. పాపం! చిన్న పిల్ల దానికేం తెలుసు? ఏదో ఇక్కడే తింటూ, తిరుగుతూ పిల్లలతో హాయిగా ఉంటూంది కదా? అందుకని ఇంటికి వెళ్ళ బుద్ధి కావడం లేదేమో?" అంటూ ఆమెను సమర్థించాడు. పుష్పవల్లి సరేననగానే పార్వతి సంబర పడిపోయి ఇంటికి వెళ్ళి తన పక్క బట్టలు తెచ్చుకుంది.

పార్వతి రాత్రిళ్ళుకూడా ఇంట్లోనే ఉండిపోవడంతో పుష్పవల్లి పని మరింత తేలిక అయింది. రాత్రి భోజనాలు కాగానే కంచాలు తీయడం, వంటిల్లు కడగడం, పక్కలు వేయడం అన్నీ పార్వతి చేస్తూంది. పుష్పవల్లికి ఇప్పుడు పిల్లలను ఇంట్లో వదిలి పెట్టి భర్తతో సినిమాకి వెళ్ళడానికి బాగా అనుకూలమయింది.

రోజులు గబగబా దొర్లుతున్నాయి. పార్వతి పూర్తిగా ఇంట్లో మనిషే అయిపోయింది ఇప్పుడు. పుష్పవల్లి ఆమెకు పాత చీరలూ, లంగాలూ ఇస్తూనే ఉండడంతో ఎప్పుడూ నీటుగా, శుభ్రంగా ఉంటుంది.

ఒకసారి పుష్పవల్లి గోవిందరావుపేటలో స్నేహితురాలు ఝాన్సీ పెళ్ళికి వెళ్ళవలసి వచ్చింది. పెళ్ళికి బయలుదేరిన పుష్పవల్లి పార్వతితో-"నువ్వింక నే నొచ్చేదాక రాత్రిళ్ళు మీ ఇంటికి వెళ్ళిపోవాలి. తెలిసిందా? ఉదయం పూట వచ్చి ఇల్లు వూడ్చి, ఇంకేమైనా పని ఉంటే చేసేసి వెళ్ళిపోతే చాలు. రోజంతా ఇక్కడ ఉండవలసిన అవసరం లేదు" అని గట్టిగా చెప్పింది.

"అయ్యగారు హోటల్ నుంచి కారియర్ తెప్పించుకుంటారు. కాబట్టి అంట్లు తోమే పనికూడా ఉండదు. నువ్వు మీ ఇంట్లోనే తిను" అని చెప్పవలసినవన్నీ చెప్పి వెళ్ళింది పుష్పవల్లి.

వారం రోజుల తరవాత గోవిందరావుపేట నుంచి తిరిగి వచ్చిన పుష్పవల్లి ఇంట్లో అడుగు పెడుతూనే ఎదురయిన పార్వతిని చూసి ఆశ్చర్యపోయింది. అప్పుడు సాయంకాలం ఆరు గంటలు. 'తను అన్ని సార్లు చెప్పినా వినకుండా ఇది ఇంట్లోనే ఉందన్న మాట' అనుకుని లోపలకు నడిచింది. హాల్లోకి వెళుతూనే అక్కడ జరిగిన మార్పులను చూసి ఆమె కనుబొమ్మలు ముడిపడ్డాయి. "ఏమిటిది? సోఫాలు అక్కడ ఎందుకు ఉన్నాయి? టీపాయ్ నిటూ, రేడియో బల్ల పటూ జరిపిం దెవరు?" అంటూ పార్వతి వైపు కోపంగా చూసింది.

పార్వతి ఏమాత్రం తొణక్కుండా -"అన్ని సామాన్లు ఉన్న జాగాలనే ఉంటే ఇల్లు ఒకటే తీరు గుంటదమ్మగారూ. . . మల్ల మల్ల చూస్తుంటే యాష్ట కూడా వస్తది. అందుకని నేనే అన్ని జరిపిన మీరు వూరికి పోయినప్పటి సంది నా కిదే పని. సామాన్ల కొట్టుడి కాణ్ణుంచి ఇల్లంత మంచిగ దులిపిన, కడిగిన, పరదలన్ని ఉతికిన. వంటకూడా నేనే చేసిన" అని ఇంకా చెబుతూండగానే పుష్పవల్లి గట్టిగా అరిచింది: "చాలించు ఇక. నే వెళ్ళేటప్పుడు నీకు ఏం చెప్పా నసలు? ఏం చెప్పానే?"

పుష్పవల్లి అరుపులకు భయపడకుండా తాపీగానే సమాధాన మిచ్చింది పార్వతి. "మీ రైతే చెప్పి పోయిండ్రు, నిజమే. కానీ, ఆ హోటలు భోజనం పట్టలే గద. అన్న మంత సల్లగ, కూర, సాంబారు అన్నీ సప్పంగ ఉంటే అయ్య సరింగ అన్నమే తినలే. ఆయన సరింగ తింటేనే గద మంచిగుంటరు అనుకుని నేనే వంటి చేసిన. నాలుగు దినాల సంది ఉడుకుడుకుగ చేసి పెట్టుంటె మంచిగ తిన్నరు."

ఆమె చేసిన వన్నీ మంచి పనులే. అన్నీ తమ కోసమే చేసింది. అయినా, పుష్పవల్లికి మాత్రం నచ్చలేదు. పార్వతితో మాట్లాడాలనికూడా అనిపించక రెండు, మూడు రోజులు కోపంగా, మౌనంగా ఉండిపోయింది. అయితే, పార్వతిమాత్రం ఇవేమీ పట్టించుకోకుండా మామూలుగా తన పనులు తాను చేస్తూ పిల్లల్ని ఆడిస్తూ కాలం గడప సాగింది. పోనీ మళ్ళీ అతుక్కుపోయింది ఆమెకు. హరిబాబు ఎప్పటిలా ఆమె వెనకాలే తిరుగుతూ వూళ్ళో చూసిన పూర్ణ మామగారి పూలతోట, వాళ్ళ డాబా గురించి ముద్దు ముద్దుగా చెబుతున్నాడు పార్వతికి.

ఈ వారం రోజుల్లోను పార్వతి చాలా మారి పోయినట్టు పసిగట్టింది పుష్పవల్లి. ఇదివరకటిలా అమాయకంగా ఉండకుండా ఆరిందాలా ప్రవర్తించడం స్పష్టంగా తెలుస్తూనే ఉంది.

సాయంకాలం శివరావ్ ఆఫీసు నుంచి వచ్చి తలుపు కొడితే తనే వెళ్ళి తలుపు తీయడం, అతని గదిలో లైటు వేసి ఫాన్ ఆన్ చేయడం, అతను విప్పి పెట్టిన బూట్లను రాక్‌లో అమర్చడం, సిగ్గు పడుతూ నవ్వుతూ అతని వంక చూడడం అతని వెనకాలే తిరగడం చూసి పుష్పవల్లి, సహించలేక పోయింది. అయినా, పైకేమీ అనకుండా కోపాన్నం లోలోపల దిగమింగుకుంది.

ఆ రోజు శివరావ్ ఆఫీసు నుంచి రాగానే ఎప్పటిలా కాళ్ళూ, చేతులూ కడుక్కుని డైనింగ్ టేబిల్ దగ్గిరికి వచ్చాడు. పుష్పవల్లి మధ్యాహ్నం చేసిన రవ్వలడ్డూలూ కారప్పూసా ప్లేట్లో తెచ్చి అతని ముందు పెట్టింది. అత నింకా ప్లేటు అందుకోక ముందే అక్కడికి పరుగెత్తుకు వచ్చింది పార్వతి. "అయ్యయ్యో అమ్మగారూ! అయ్య సాయంత్రం పూట ఇవన్నీ తినరండి.




దీర్ఘ వ్యాధులకు ఉత్తమ వైద్యం!



దురభ్యాసములకులోనై దాంపత్యసౌఖ్యంపొందలేనివారు, హెర్నియా, చర్మవ్యాధులకు పోస్టు ద్వారావరిబీజము(బుడ్డ). మూత్రవ్యాధులు, ఇస్నోఫీలియా, దమ్ము, ఉబ్బసమునకు ఆపరేషన్‌లేకుండ రండి.

డా॥ దేవర,
5/1, బ్రాడిపేట, గుంటూరు-2
బ్రాంచిలు: 26, నార్త్‌బోగ్‌రోడ్, మద్రాసు-17.
మార్వాడిగుడివద్ద, తెనాలి.

ఏజంట్లు కావలెను

తీరిక కాలమందు శక్తి ప్రకారం గంటలు లెక్కించుకొని మీ చీరల అమ్మకము ద్వారా జీతం కాక కమీషను మీద నెలకు రూ. 700/- సంపాదించుకొనుటకు ఏజంట్లు కావలెను. ఉచిత లెటరేచరుకు, కాంపిటీకు వ్రాయండి.

**SAKTHI TEXTILES AGENCIES (APW)**
**Post Box No. 1138, Delhi-110006**

పెండ్లికి ముందు, తర్వాత!

నరముల బలహీనత, శుక్లనష్టము, శీఘ్ర స్ఖలనము, ఇతర సెక్సు సమస్యలకు, చర్మ వ్యాధులకు (ఏ రకమైనవనా), ఇస్నోఫీలియా, దమ్ము, ఆయాసము, ఉబ్బసము, అజీర్ణ వ్యాధులకు ప్రత్యేక చికిత్స. పోస్టు ద్వారా కూడా ఔషధములు పంపబడును. వివరాలకు 50 పై.లు స్టాంపులు పంపండి.

బాబా అండ్ కో ఆస్పత్రి,
తాలూకా ఆఫీసు ఎదుట, విజయవాడ







ఒట్టి బిస్కట్లు తింటారు" అంటూ బిస్కట్ల డబ్బా తెచ్చి టేబుల్ మీద పెట్టింది.

పుష్పవల్లికి ఒళ్ళు మండిపోయింది. అంత వరకూ బిగపట్టిన కోపమంతా ఒక్కసారి పైకిబికింది. "ఏమిటే నీ పోడి పెత్తనం? అన్నిటికి మధ్యలో నువ్వెందుకు కొస్తావు, నోరు మూసుకుని నీ పనేదో నువ్వు చూసుకో కాని, ఇలా ప్రతి దానికి తయారు కావద్దు" అంటూ కసురుకుంది.

పార్వతి బిక్క మొహం వేసింది. ఆమె కళ్ళలో నీళ్ళు వెలికాయి. కళ్ళు తుడుచుకుంటూ బయటికి వెళ్ళిపోయింది.

శివరావ్ పెద్దగా నవ్వడం మొదలు పెట్టాడు. అది చూసి పుష్పవల్లి కోపం అతని మీదికి తిరిగింది. "నేను లేనప్పుడు దాన్ని నెత్తి కెక్కించుకుని అన్ని అధికారాలు చెలాయించడానికి దానికి పూరి స్వేచ్ఛ నిచ్చారు కదూ? అసలిదంతా మీ వల్లే జరిగింది" అంటూ రుస రుస లాడింది.

శివరావ్ మరింత పెద్దగా నవ్వుతూ, "అబ్బబ్బ! ఎంత కోపం వచ్చిందోయ్ నీకు? అస లిప్పుడు వీ కొచ్చిన నష్టమేమిటి? ఇంట్లో దొంగతనమేమీ జరగలేదుగా? అసలు అది ఉన్న కారణం చేతనే ఇల్లంతా ఇంత క్లీన్‌గా ఉంది నువ్వు వచ్చేసరికి. లేకపోతే అంతా దుమ్ము కొట్టుకుని నువ్వు రాగానే ఒక పూటంతా శ్రమ పడి శుభ్రం చేసుకోవలసి వచ్చేది. ఇంతకూ అది చేసి నదంతా మన కోసం, మన మంచికోసమేగా? నాకు హోటల్ భోజనం సహించడం లేదని గ్రహించి, నే వద్దంటున్నా వినకుండా వండి పెట్టింది. పగలూ, రాత్రీ మన ఇంటిని కని పెట్టుకుని ఇక్కడే పడి ఉండేది తెలుసా? పాపం!" అన్నాడు. అతడి మాటల్లో పార్వతి పట్ల సానుభూతి ఉట్టి పడుతూంది.

పుష్పవల్లి మరింత మండి పడుతూ—"రాత్రిళ్ళు ఎందు కిక్కడే పడుకోమన్నారు దాన్ని?" అంది.

శివరావ్ నవ్వు మాయమయింది. మొహం గంభీరంగా తయారయింది. "ఏమిటి వల్లీ, నీవు మరీను! చివరికి ఆడబుద్ధి పోనిచ్చుకున్నావు కాదు. అసలు దాని వయసేమిటి చెప్పు? ఏమీ ఎరగని చిన్న పిల్ల మీదకూడా నీ కనుమానమేనా? పాపం! ఎంత చాకిరీ చేస్తూంది మన కోసం? తన సొంత ఇంటి కన్న జాగ్రత్తగా చూసుకుంది మన ఇంటిని అదే లేకపోతే నేను భోజనానికి ఎంత ఇబ్బంది పడే. వాడిని ఆలోచించు" అన్నాడు.

పుష్పవల్లి మవునం వహించింది. పార్వతి వయస్సు, ఆమె చేస్తున్న చాకిరి అంతా తనకు తెలిసే ఉన్నా, మనసులో మాత్రం ఏదో ముల్లు గుచ్చుకున్నట్లు బాధగానే ఉంటూంది ఎందుకనో. ఆమె అధిక ప్రసంగం, అతితెలివి తనకు నచ్చక కాబోలు ముఖ్యంగా భర్త దగ్గర ఆమె అంత చనువుగా ఉండడాన్ని తను సహించలేక పోతూంది. ఆఫీసుకు వెళ్ళబోయే ముందు అతనికి బూట్లు అందించడం, టిఫిన్ బాక్సు బాగ్‌లో పెట్టడం, గుమ్మం దాకా అతణ్ణి సాగనంపడం చూస్తుంటే ఒళ్ళంతా కారం రాసుకున్నట్లు మంట పేస్తుం దామెకు.

"అలాంటి పని లో నువ్వు జోక్యం చేసుకోవ"ద్దని పుష్పవల్లి ఆమెను హెచ్చరించేసరికి శివరా[illegible] ఎల్లీ తెలగజేసుకుని, 'ఊరికే అడిగిన దానికీ, కానిదానికి

అలా ఎందుకు విసుక్కుంటావు దాన్ని? పాపం! ఒక చిన్న మంచి మాట కోసం ఎంతగా తపించిపోతుందో అది! నువ్వు మోహంతో ఒక మంచి మాట మాట్లాడితే నీ సొమ్మేం పోతుంది?'' అన్నాడు.

అయినా పుష్పవల్లి అతని మాటలు లక్ష్యపెట్టక, అతని పనులేమీ చెయ్యడానికి వీలులేదని పార్వతికి గట్టిగా చెప్పింది.

శివరావ్ భార్య అమాయకత్వానికి, మొండి తనానికి నవ్వుకుని పూరుకున్నాడు. ఒక్కోసారి పుష్పవల్లికే తను చేస్తున్నది బాగాలేదనిపిస్తూ ఉండేది. ఛ! చిన్న పిల్లతో తనకు తగాదా ఏమిటి? అనిపించినప్పుడల్లా తన ప్రవర్తనకు తనకే సిగ్గేసేది. అయితే, పైకిమాత్రం అదేమీ కనిపించనీయకుండా గంభీరంగా ఉండిపోయేది.

పుష్పవల్లి మనసునిండా పార్వతి గురించి, ఆమె ప్రవర్తన గురించి ఇలా ఆలోచనలు చెలరేగుతున్న సమయంలోనే పాప సోనీకి విరేచనాలు పట్టుకున్నాయి. రోజూ బోలెడు గుడ్డలు పాడుచేసేది సోనీ. తల్లిని ఒక్క క్షణం కూడా వదలక ఎప్పుడూ ఏడుస్తూనే ఉండేది. పుష్పవల్లి తను నెన్ని మాటలన్నా అవేమీ మనసులో పెట్టుకోకుండా ఆ గుడ్డలన్నీ ఉతికి ఆరేసేది పార్వతి. కొంచెం కూడా విసుక్కోకుండా, అసహ్యించుకోకుండా పార్వతి అవన్నీ ఉతుకుతూంటే పుష్పవల్లికి ఎలాగో అనిపించేది.

పొద్దస్తమానం పాపను ఎత్తుకుని ఇంటి పని అంతా పూర్తిగా పార్వతిమీదే వదిలేసి కూర్చున్న పుష్పవల్లికి మరొక పరీక్ష ఎదురయింది. శివరావ్‌కు జబ్బు చేసింది.

ఒక రోజు ఆఫీసు నుంచి వస్తూనే జ్వరంతో పడుకున్నాడు శివరావ్. తల పోటూ, కాళ్ళు నొప్పులూ భరించలేక భార్యను కాస్త తలా, కాళ్ళూ పట్టమన్నాడు. పాపను ఒళ్ళో పడుకోబెట్టుకుని ఆందోళనగా అతని పక్కనే కూర్చున్న పుష్పవల్లి భర్తకు కాళ్ళు పట్టబోయింది కాని, పాప ఆమెను పట్టనివ్వకుండా పెద్దగా ఏడుపు ప్రారంభించింది.

అప్పుడు పార్వతి అక్కడికి వచ్చింది. "అమ్మా, మీరు లేవండి. అయ్యకు నేను కాళ్ళు పడత. మూండె రాత్రిల నిద్దుర లేదు మీకు. ఇయన్నీ జేస్తే మీరు భీమారు పడతరు. అంతే ఇగ'' అంది.

పాప ఏడుపు అంత కంతకు ఎక్కువ కావడంతో పుష్పవల్లికి లేవక తప్పింది కాదు. ఇక అప్పటినుంచి జ్వరం తగ్గేదాకా శివరావ్‌కు అన్ని సేవలూ పార్వతే చేసింది. వేళకు సరిగ్గా మందులివ్వడం, కాళ్ళూ, చేతులూ, తలా పట్టడం, అతను అడగగానే కాఫీయో, హార్లిక్సో కలిపి ఇవ్వడం—ఒకటేమిటి? అన్నీ అవే చేసింది. పుష్పవల్లికి చాలా ఆశ్చర్యంగా ఉండేది ఇవన్నీ చూస్తూంటే. "ఏసీ పాటా, బరువూ బాధ్యతా ఏదీ లేకుండా హాయిగా ఆడుకోవలసిన ఈడులో ఉన్న పిల్ల అన్నీ తెలిసిన ఆరిందాలా రాత్రింబవళ్ళు సేవలు చేస్తూ, విసుగూ విరామం లేకుండా, తిండీ తిప్పలమీద ధ్యాస లేకుండా, ఇంటికి వెళ్ళాలన్న మాటే ఎత్తకుండా అలా చాకిరీ చేస్తూంటే పుష్పవల్లికి ఎంతో సిగ్గూ, పశ్చాత్తాపమూ కలిగాయి.

"ఇప్పుడు పార్వతే కనక లేకుంటే నా గతి ఏమయ్యేది?'' అని రోజుకు పదిసార్లయినా అను కుంటూ, ఆమెను అనవసరంగా నిందించినందుకు మనలో తానే పశ్చాత్తాప పడి, పరిహారార్థంగా పార్వతికి పట్టు చీర కొనిపెట్టింది పుష్పవల్లి. ఇంటికి వచ్చే పోయే వాళ్ళంతా పార్వతిని పొగుడుతూ, ఆమె పనితనాన్ని మెచ్చుకుంటూంటే ఇప్పుడు పుష్పవల్లికి అసూయ కలగడానికి బదులు అభిమానం కలుగుతూంది.

పాపకు విరేచనాలు తగ్గి ఎప్పటిలా ఆడుకోవడం మొదలు పెట్టింది. శివరావ్‌కు జ్వరం పూర్తిగా తగ్గి ఆఫీసుకు వెళ్ళి వస్తూండడంతో ఇల్లు ఎప్పటిలా ప్రశాంతంగా ఉండి, పుష్పవల్లికి కాస్త తీరిక దొరుకుతూంది.

కాలక్షేపంకోసం కుట్టు క్లాసులో చేరింది పుష్పవల్లి. ఆమె క్లాసుకు వెళ్ళినప్పుడల్లా పార్వతే పిల్లను చూసుకునేది. ఒక నెల రోజులు ఏ ఒడిదుడుకులూ లేకుండా మామూలుగా గడిచి హాయిగా ఉంటున్నామని అందరూ అనుకునే టంతలో ఉన్నట్టుండి ఒక గాలి దుమారం రేగింది ఇంట్లో.

ఆ రోజు మామూలుగా మధ్యాహ్నం రెండు గంటలకు కుట్టు క్లాసుకు వెళ్ళిన పుష్పవల్లి టీచరుకు ఒంట్లో బాగుండక క్లాసు లేదని చెప్పడంతో ఇంటికి తిరిగి వచ్చేసింది. దగ్గరగా వేసిన వీధి తలుపుతీసుకొని లోపలికి వెళ్ళిన పుష్పవల్లి పార్వతి కన బడకపోయేసరికిల్లంతా వెతికి, చివరికిల మెపడకగదిలో తన మంచం మీద తన శాలువా కప్పుకుని పాప పక్కన పడుకుని ఉండడం చూసి ఉగ్రురాలయింది. పుష్పవల్లి అంత త్వరగా తిరిగి వస్తుందని వూహించని పార్వతి ఆమెను హటాత్తుగా చూడగానే ఆదరా బాదరా లేచి నిలబడింది. పుష్పవల్లి కళ్ళలోని కోపం చూసి భయపడి, "ఎంతసేపైనా పాప పడుకోలే దమ్మా ... అందుకని ...'' అంది తలవంచుకుని. ఆమె పైట చాటున చెయ్యి వేసుకుని జాకెట్టు హుక్కు పెట్టుకుంటూ ఉండడం చూసిన పుష్పవల్లి కోపంతో పూర్తిగా పిచ్చిదే అయింది.

"ఇక్కడెందుకు పడుకున్నావే, దొంగ ముండా? నా మంచం మీద పడుకోవడానికి ఎన్ని గుండెలు? అసలు నువ్విక్కడ పడుకుని ఏం చేస్తున్నావు? నిజం చెప్పు. సిగ్గులేదూ? పన్నెండవ ఏటే ఇన్ని వేషాలు వేస్తున్న నీవు రేపు వయసు వచ్చాక ఏమేం చేస్తావో, ఏమో? ఇలాంటి అకతాయిపిల్ల నా ఇంట్లో ఉండడానికి వీల్లేదు. పో బయటికి'' అంటూ చడామడా తిట్టేసింది.

పార్వతి ఎంతో ఏడ్చింది. ఇంకెప్పుడూ ఇలా చెయ్యనని కాళ్ళావేళ్ళా పడి ప్రార్థించింది. అయినా, పుష్పవల్లి వినలేదు. పార్వతిని బరబరా లాక్కువెళ్ళి బయటికి తోసి తలుపులు దడాలున మూసేసింది.

సాయంకాలం ఆరింటికి ఆఫీసు నుంచి వచ్చిన శివరావ్ పార్వతిని చూసి ఆశ్చర్యపోయాడు. "ఏమయింది, పార్వతీ? ఎందు కిక్కడ కూర్చుని ఏడుస్తున్నావు? అమ్మగారు ఇంట్లో లేరా?'' అంటూ అనునయంగా అడిగాడు. పార్వతి ఉన్నా రన్నట్టు తల వూపి లేచి నిలబడి, "పగలు పాప పడుకోక పోతే నేను అమ్మగారికి మల్లె మంచం మీద పాప

ఆంధ్రరాష్ట్రంలో ప్రజాభిమానం పొందిన పటము!

అవును.

శ్రీ జయ హనుమాన్



అనేక రంగుల పటము

(కాపీ రైట్ రిజిస్టర్డు నం. ఏ—20286/78)

కొత్త ప్రింట్లు వచ్చి యున్నవి.

శ్రీ సెంగలిపురం అనంతరామ దీక్షితర్ వారి జయ మంగళ స్తోత్రం ఆధారముగ తమిళ వారపత్రిక 'కల్కి' యొక్క చిత్రకారుడు **వినూ** చే రచించబడినది.

జగద్గురు శ్రీ కంచి శంకరాచార్యస్వామి (సీనియర్) వారిచే ఆశీర్వదించబడినది.

ఈ పటమును 45 దినములు పూజించిన పిమ్మట అనేక మందికి ఉద్యోగము, వివాహము, మంచి వ్యాపారము, పరీక్షలో విజయము చేకూరినవి. చింతల నుంచి, ఆర్థిక సమస్యల నుంచి స్వస్థత చేకూరినది. వ్యాధులు నయమైనవి. మేలు పొందిన వారు కృతజ్ఞత తెల్పుచు, శ్రీ హనుమాన్ వారి మహాత్మ్యము, శక్తిని శ్లాఘించుచు ఉత్తరములు వ్రాస్తున్నారు. తెలుగు, కన్నడము మరియు తమిళము—సంపూర్తము కలిసి యున్న పూజా విధానపు పుస్తకము పటముతో పాటు పంపబడును.

గట్టి నమ్మకతో మీరు పూజ చేసిన యెడల జయము తథ్యము.

వెల మరియు సైజు

13½'' X 20'' రూ. 6—00
9½'' × 15'' రూ. 4—00

పూజ పుస్తకంతో

ప్యాకింగ్‌తో సహా రిజిస్టర్డు పోస్టేజి రెండు కాపీల వరకు రు. 4—25 లు అదనం. సాదా పోస్టు లేదు వి. పి. పి. లేదు. 50 మరియు అపైబడిన కాపీలకు 20 శాతం డిస్కౌంటు.

దిగువ తెల్పిన అడ్రసుకు పోస్టేజి కలుపుకు మొందుగ మనియార్డరు పంపండి.

యజమానురాలు.

**Smt. SARASVATHY VENKATRAMAN**

**W|O VINU (Kalki),**

**Publisher of Divine Pictures,**

16, Velayuthamudali Street, Nungambakkam, MADRAS-600 034.

Phone: 89191.

(Near Valluvar Kottam Bus Stop)

దగ్గర పడుకున్న. అందుకని అమ్మగారు నన్ను తిట్టి బయటకు వెళ్ళగొట్టిండ్రు" అంది ఏడుస్తూ.

శివరావ్‌కు చాలా జాలి వేసింది. "నే చెబుతాలే అమ్మగారికి. నువ్వు లోపలికి పద" అంటూ తలుపు తట్టాడు. తలుపు తీసిన పుష్పవల్లి భర్త వెనకాల పార్వతి ఉండటం చూసి కోపంతో ఉడికిపోతూ— "ఇంకా ఇక్కడే తగలడ్డావా?" అని ఇంకేదో అన బోయింది. కాని, శివరావ్ అడ్డుపడ్డాడు. "ఆఁ—ఆఁ అంతటితో ఆపుఇక. మళ్ళీ మొదటి కొచ్చావా? ఈ సారి కోపం హై టెంపరేచర్ మీద దున్నట్టుందే!" అంటూ తేలికగా నవ్వబోయాడు కాని, పుష్పవల్లి మొహం చాలా సీరియస్‌గా ఉండడం చూసి ఆగి పోయాడు.

"అదేం చేసిందో మీకేం తెలుసు? అందుకే దాన్నిక వనిలోకి రావద్దని చెప్పాను" అంటూ లోపలికి దారితీసింది పుష్పవల్లి.

"ఏదో చిన్నపిల్ల. తెలియక చేసిన దానికి ఇంతగా కోపగించుకోవడం ఏం బాగా లేదు, వల్లీ" అంటూ ఆమెను అనుసరించాడు శివరావ్. అతన్ని పడక గది లోకి తీసుకు వెళ్ళి, పార్వతి చేసిన పని గురించి చెప్పింది పుష్పవల్లి.

అది విని శివరావ్ విరగబడి నవ్వాడు. "హోన్! ఇంతేకదా! తెలియని వయసులో పిల్లలు ఏవేవో చేస్తూ ఉంటారు. నువ్వు చేసేదంతా చూసి తనూ నీలాగే చెయ్యాలని సరదా పడిందేమో దానికి? పోనీలే. ఇంకెప్పుడూ అలాంటి పిచ్చి పనులు చెయ్యవద్దని హెచ్చరిస్తే సరి" అని పుష్పవల్లికి నచ్చచెప్పి, పార్వతిని ఇంట్లోకి పిలిచాడు.

ఆ సంఘటన జరిగిన తరవాత పార్వతి పట్ల చాలా ముభావంగా ఉండిపోయింది పుష్పవల్లి. పనుల గురించి ఒకటి రెండు మాటలు తప్పితే ఎక్కువ మాట్లాడడం మానేసింది. పిల్లలను ఆమెకు అప్ప గించి వెళ్ళకుండా ఎక్కడికి వెళ్ళినా తనతోనే తీసుకు వెళుతూంది. పార్వతి కూడా చాలా జాగ్రత్తగా మసలుకుంటూ, పుష్పవల్లికి కోపం తెప్పించే పను లేమీ చేయకుండా కాలం గడుపుతూంది.

శివరావ్‌కు పార్వతిపట్ల ఎంత జాలి ఉన్నా ఈ సారి మాత్రం భార్య కోపాన్ని పోగొట్టి ఆమె పార్వతితో మామూలుగా మసలుకునేటట్టు చేయలేకపోయాడు. అయితే, పార్వతి తా ననుకున్నంత చిన్న పిల్లా, తను పూహించినంత అమాయకురాలూ కాదని తెలిసే రోజు వస్తుందని మాత్రం అతను అనుకోలేదు.

పుష్పవల్లి చెల్లెలు శోభ నాలుగు రోజులు సరదాగా కాలం గడిపి వెళదామని అక్కగారి ఇంటికి వచ్చింది. ఆమె వచ్చినప్పటినుంచి పుష్పవల్లి చాలా హుషారుగా ఉంటూ చెల్లెల్ని ఊరంతా తిప్పసాగింది. శివరావ్‌కు సెలవు దొరక్కపోవడంతో వాళ్ళతో ఎక్కువగా వెళ్ళ లేకపోయాడు.

ఒక రోజు అక్కా చెల్లెళ్ళు ఇద్దరూ సినిమా ప్రోగ్రామ్ వేసుకుని శివరావ్‌ను పెందలాడే ఇంటికి రమ్మన్నారు కాని, అతనికి ఆ రోజు ఆఫీసులో పని ఎక్కువగా ఉండడంచేత తను రాలేనని ముందే చెప్పే శాడు. త్వరగా వంట పని తెముల్చుకుని, పుష్పవల్లి, పిల్లల్ని తీసుకుని, చెల్లెలుతో సినిమాకు వెళ్ళిపోగానే పార్వతి ఇంట్లో ఆ పనీ, ఈ పనీ చూడడం మొదలు పెట్టింది. పిల్లల్ని తన దగ్గరికి చేరనివ్వకపోవడం చూసి తను ఎంత బాధ పడుతున్నా, పుష్పవల్లితో ఆ మాట చెప్పడానికి ధైర్యం చాలక మవునంగా ఉండిపోయింది.

శివరావ్ ఆఫీసునుంచి వచ్చేసరికి ఏడు గంట లయింది. బాగా అలిసిపోయి ఉండడంచేత రాగానే మంచంమీద వాలిపోయాడు శివరావ్. అతను రావడం చూసిన పార్వతి వేడిగా కాఫీ తయారుచేసి పట్టుకుని అతని గదిలోకి వెళ్ళింది. శివరావ్ కాఫీ అందుకుంటూ యాథాలాపంగా పార్వతి వైపు చూసి ఆశ్చర్యపోయాడు. అతని కళ్ళు పెద్దవయ్యాయి. వెంటనే నవ్వూ వచ్చింది. పార్వతి ఆ రోజు అచ్చు పుష్పవల్లిలాగే తయారయింది. పెద్దగా సిగ చుట్టి, ఒక పక్కగా పూలు పెట్టుకుంది. కళ్ళకు కాటుక, నుదుట బొట్టు అన్నీ పుష్పవల్లి పెట్టుకున్నట్టే పెట్టుకుంది. శివరావ్ నవ్వుతూ, "ఏం పార్వతీ! ఈ వేళ నువ్వే అమ్మగా రయిపోయావే?" అంటూ వేళాకోళం చేశాడు. తన మాటకు సిగ్గుపడి పారి పోతుందనుకున్న పార్వతి అక్కడే నిలబడి, "నా నసీబు అంత మంచిదయితే ఇగ నాకేం తక్కువ" అనడంతో అతని ఆశ్చర్యం మరింత ఎక్కువ అయింది.

పార్వతి కాలి గోరుతో నేలను గీరుతూ చెప్ప సాగింది: "నా నసీబు మంచిగుంటే అందరి లెక్క నాకూ పెండ్లయితుండె. నేను గూడ అత్తగారింటికి పోతుండె...ఇట్ల అందరితోని తిట్లు తినకుంట మంది ఇండ్లల్ల కొలువు ఉండకపోతుంటి" అంది.

"ఇప్పుడు నీకేం తక్కువయింది, పార్వతీ?" నవ్వుతూ అన్నాడు శివరావ్. అతనికి ఈ వేళ పార్వతి వింతగా కనిపిస్తూంది. పార్వతి పేలవంగా నవ్వింది. "నాకేం తక్వలే! అయితే, పద్దెనిమిదేండ్లొచ్చినా పెండ్లి కాకుండ ఇట్లుంటి. ఎవరికి మంచిగనిపిస్తది— మీరే చెప్పండి? మా అమ్మా, నాయినా నా కీ జన్మల పెండ్లి చెయ్యరు. నా కెరికే. మా అక్కలకే ఇంక జెయ్యలే గద? మల్ల నా కెట్ల జేస్తరు? తెచ్చిన పైస లన్నీ తాగటానికే సరిపోతవి మా నాయనకు ... అందుకే మనసులో ఎన్నో ఆశలున్న గూడ నేను ఎప్పుడూ ఎవరోటి ఏమనలే ... ఈడి కొచ్చి నప్పటి సంది నాకు జర మంచి గనిపిస్తున్నది ... అమ్మగారు తిట్టినా మీరు శాన మంచోరు. నన్ను మంచిగ జూస్తరు" అంది.

"ఏమిటీ! పద్దెనిమిదేళ్ళా నీకు? మరి పుష్పవల్లి నీకు పన్నెండేళ్ళని చెప్పిందే?" ఆశ్చర్యంతో చటుక్కున లేచి నిలబడ్డాడు శివరావ్.

"అవునయ్య. నేనే అట్ల చెప్పిన. లేకుంటే కొలువుంచుకోరని భయపడి మా అమ్మ నాకు ఏండ్లు తక్వ జెప్పమని చెప్పింది. అండ్ల సరింగ తిండి, బట్ట లేక బక్కగున్నగద? ఎవరైన నమ్ముతరు గూడ! గాని నాకు మనసుల ఆశలు మాత్రం శాన న్నయి. అవన్నీ ఎట్లైనా తీరేటివి గావని నాకు తెలుసు. అందుకనే నేను మీకే అన్ని సేవలు చేస్తూ నా ఆశలు తీర్చుకుంటున్న. ఎప్పటికీ ఇట్లనే మీకు సేవలు జేసుకుంట ఇక్కడే ఉండిపోతా" అని చెప్పి వెక్కి వెక్కి ఏడవసాగింది పార్వతి.

శివరావ్ జాలిగా ఆమె వీపు నిమురుతూ, "తప్పు, పార్వతీ. అలా ఏడవకూడదు. ఇప్పుడు నీ కేమయిం దని ఏడుస్తున్నావు? నీకు తప్పక పెళ్ళవుతుంది. మంచి మొగుడు దొరికి నిన్ను బాగా చూసుకుంటాడు. నువ్వేం బెంగపెట్టుకోకు. కానీ, ఒక మాట! నువ్వింకా చిన్న పిల్లవనే అనుకుని ఇన్నాళ్ళూ నీతో చనువుగా ఉంటూ నిన్ను వేళాకోళం చేశాను. ఏమీ అనుకోకు. అమ్మగారికి మాత్రం ఈ సంగతి చెప్పకు. అంతేకాదు, నువ్వు ఆమె లాగ అలంకరణ చేసుకోవడంకూడా మానేయి. వయసు తక్కువ చెప్పినప్పుడు అంతా చిన్న పిల్ల లాగే చెయ్యాలి గాని, పెద్దవాళ్ళ లాగ చెయ్య కూడదు. ఆమె ముందే అనుమానం మనిషి. నిన్నిక్కడి నుంచి వెళ్ళ గొట్టేస్తుంది. ఏమీ ఎరగనట్టు నీ పని నీవు చేసుకుంటూ మామూలుగా ఉండిపో" అన్నాడు.

పార్వతి అతని మంచితనం చూసి కరిగిపోయి, భక్తితో అతని పాదాల మీద వాలిపోయింది. "మంచి దయ్య. మీరు చెప్పినట్టే ఇంట. ఇప్పుడు నా మనసు అల్కగయింది" అంటూ లేచి కళ్ళు తుడుచు కుంటూ అక్కడినుంచి వెళ్ళిపోయింది. ✸

